కార్మికుల బీమాపై ప్రభుత్వం శీతకన్ను

- జీమా చెల్లింపునకు కార్మికుల అనాసక్తి
- గణనీయంగా తగ్గిన రిజిస్ట్రేషన్లు



తాపీపని చేస్తున్న కార్మికులు (ఫైల్)

యలమంచిలి: ఎన్నికలకు ముందు కార్మిక సంక్షేమ బోర్డు పునః ప్రారంభించి కార్మికులకు అన్ని ప్రయోజనాలను కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ పెద్దలు 15 నెలలైనా కార్మికుల సమస్యలపై నోరెత్తడం లేదు. పెండింగ్లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే చెల్లిస్తామని ఇంత వరకు నిధులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని కార్మికులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలను కల్పించడంతోపాటు కార్మికులకు బీమాపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

రూ.110 చెల్లిస్తే ఐదేళ్లపాటు బీమా

కార్మికుల బీమా పథకం ద్వారా భవన నిర్మాణ రంగ కార్మికులు, నిర్మాణ రంగ అనుబంధ కార్మికులకు కార్మిక శాఖ అనేక ప్రయోజనాలు కల్పించేది. ఐదేళ్ల కాలానికి బీమా రుసుము రూ.110 చెల్లిస్తే ఐదేళ్ల పాటు బీమా అమల్లో ఉండేది. అయితే చాలా కాలం నుంచి కార్మికులు బీమా చెల్లిస్తున్నా వారికి ఎలాంటి పథకాలు వర్తించడం లేదు. గతంలో బీమా చెల్లించిన కార్మికులకు సహజ మరణం, ప్రమాద మరణం, వారి పిల్లలకు పెళ్లి కానుక, ప్రసవ కానుక, స్కాలర్‌షిప్‌లు ఇలా పలు రకాల ప్రయోజనాలు అందేవి. కానీ కొన్నేళ్లగా క్లెయిమ్లు పెండింగ్‌లో ఉండడంతో నూతన కార్మిక బీమా రిజిస్ట్రేషన్స్‌పై కార్మికులు ఆసక్తి చూపడం లేదు.

తగ్గిన దరఖాస్తులు

నరసాపురం డివిజన్‌లో భవన నిర్మాణ కార్మికులు దానికి అనుబంధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా పని చేసే కార్మికులు, సుమారు 30 నుంచి 35 వేల మంది ఉన్నారు. గతంలో ఏటా సుమారు 2000 నూతన, రెన్యువల్ దరఖాస్తులు వచ్చేవి. ప్రస్తుతం అవి 100 కూడా రావడం లేదు. గతంలో కార్మిక శాఖ కార్యాలయంలో రుసుము కట్టించుకుని దరఖాస్తులు తీసుకునేవారు. ప్రస్తుతం ఈ–సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అయితే పథకాలు వర్తించక పోవడంతో బీమా చెల్లించడానికి కూలీలు ముందుకు రావడం లేదు.

పెండింగ్‌లోనే క్లెయిమ్‌లు

బీమా ప్రీమియం చెల్లించి ప్రసవ కానుక, ప్రమాద మరణం, సహజ మరణం వంటి ప్రయోజనాలకు సంబంధించిన క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వీరికి చాలా కాలం నుంచి బీమా ప్రయోజనాలు రావడం లేదు. నరసాపురం డివిజన్‌లో ప్రసవ కానుక కింద 319, సహజ మరణం 5, మట్టి ఖర్చులు 14, వివాహం 6, ఆసుపత్రి బిల్లులు 14, స్కాలర్‌షిప్‌లు 2 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. దీంతో కార్మికులు, కూలీలు ఏడాదికి రూ.22 చొప్పున, ఐదేళ్లకు రూ.110 నామమాత్రపు రుసుము చెల్లించటానికి కూడా ముందుకు రావడం లేదు.

పట్టించుకోని ప్రభుత్వం

రాష్ట్రంలో వ్యవసాయం తరువాత నిర్మాణ రంగంలోనే అత్యధిక మంది కార్మికులు పని చేస్తున్నారు. అలాంటి కార్మికులకు ప్రభుత్వం ఎటువంటి భరోసా కల్పించకపోవడం అమానుషమని వాపోతున్నారు. జీఓ 1214 పునరుద్ధరించి గతంలో ఉన్న బీమా పథకాలను మళ్లీ వర్తింప చేయాలని కార్మికులు కోరుతున్నారు. కూలీల బీమాకు 18 నుంచి 55 సంవత్సరాల స్త్రీ, పురుషులు అర్హులు. దరఖాస్తుకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్సులు జతచేసి ఈ–సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పాలసీదారు సహజ మరణం పొందితే రూ.60 వేలు, ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు వికలాంగులైతే రూ.50 వేలు నుంచి రూ.5 లక్షలు, మూడు నెలలు ఆసుపత్రిలో ఉంటే రూ.3 వేలు, గాయాలకు రూ.10 వేలు నుంచి రూ.50 వేలు, మట్టి ఖర్చులు కింద రూ. 20 వేలు, వారి పిల్లలకు 8వ తరగతి నుంచి పీజీ వరకు ఏడాదికి రూ.1200 నుంచి రూ.5 వేల వరకు స్కాలర్‌షిప్, ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ.20 వేలు, పెళ్లి కానుక రూ.20 వేలు చొప్పున ప్రయోజనాలు అందుతాయి.

16,793 మంది చెల్లించారు



నరసాపురం డివిజన్‌లో ప్రస్తుతం 16,793 మంది బీమా చెల్లించారు. వీరిలో 8170 రెన్యూవల్ చేసుకున్నారు. గత రెండు నెలలుగా 36 మంది మాత్రమే కొత్త రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కార్మికులు పథకాల దరఖాస్తులు ఇస్తుంటే తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిలుపుదల చేసిన జీఓను పునరుద్ధరించి, నిధులు మంజూరుచేస్తే పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు మంజూరు చేస్తాం.

– పి.రాజేంద్రప్రసాద్, లేబర్ ఆఫీసర్

పూరి గుడిసె దహనం చేసిన వ్యక్తి అరెస్ట్



నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తోన్న ఏఎస్పీ భీమారావు

నరసాపురం: మొగల్తూరు సెంటర్‌లో ఉన్న ముత్యాలమ్మ వారి పూరిగుడిసె ఈ నెల 9న అగ్నికి ఆహుతైన ఘటన ప్రమాదం కాదని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఎప్పటి నుంచో ఉంటున్న పూరి గుడిసె స్థానంలో సంప్రదాయం పక్కన పెట్టి సిమెంట్ షెడ్డు నిర్మిస్తున్నారనే కోపంతో మొగల్తూరు గ్రామానికే చెందిన చేపలు అమ్ముకుని జీవించే తోట శ్రీనివాస్ అనే వ్యక్తి తగలబెట్టినట్టు నిర్ధారించారు. శనివారం నరసాపురం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ భీమారావు వివరాలు వెల్లడించారు. ముత్యాలమ్మ అమ్మవారి పూరి గుడిసె దగ్ధమైన నేపథ్యంలో సున్నితమైన ఈ అంశాన్ని పోలీసుశాఖ చాలా సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టిందని చెప్పారు. ఏలూరు రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో 5 ప్రత్యేక బృందాలు ఏర్పడి దర్యాప్తు సాగించాయని చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా సాగిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించామన్నారు. భార్యతో విడిపోయి చేపలు అమ్ముకుంటూ, కూలి పనులు చేసుకుంటూ జీవించే శ్రీనివాస్ ముత్యాలమ్మకు భక్తుడిగా ఉంటూ తరచూ పూజల్లో పాల్గొనేవాడని చెప్పారు. అయితే ఇటీవల అమ్మవారి తాటాకు గుడిసె స్థానంలో సిమెంట్ ప్లాట్‌ఫామ్, షెడ్డు నిర్మించాలని తీసుకున్న నిర్ణయాన్ని శ్రీనివాస్ వ్యతిరేకించాడని ఏఎస్పీ వివరించారు. సంప్రదాయం చెడిపోతుందనే కోపంలో ఆవేశంతో నిప్పుపెట్టినట్టుగా నిందితుడు అంగీకరించాడని చెప్పారు. సమావేశంలో నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, నరసాపురం, పాలకొల్లు, పెనుగొండ, మొగల్తూరుకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ



భీమలాపురంలో రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: భీమలాపురంలో పాడి రైతులకు శనివారం పశువులదాణాను సర్పంచ్ జీ మాధవరావు పంపిణీ చేశారు. పాడి రైతులను ఆదుకోవడం కోసమే ప్రభుత్వం దాణా అందిస్తుందని వివరించారు. 115 మంది రైతులకు ఏడు మెట్రిక్ టన్నుల సమీకృత పశువుల దాణాను అందించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

పాలకొల్లు సెంట్రల్: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పశుసంవర్ధక శాక సహాయ సంచాలకుడు డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలో ఉన్న పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో ఉన్న అన్ని ఆవులు, గేదెలకు ఉచితంగా ఇంటింటికి వచ్చి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకూ నెల రోజులు పాటు ఈ టీకాలు పశువులకు ఉచితంగా వేస్తారన్నారు. ఉదయం 6.30 గంటల నుండి 10 గంటల వరకూ టీకాలు వేస్తారని, పాడి రైతులు గాలికుంటు వ్యాధి లక్షణాలను గుర్తించి పశు వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



సోమరాజును సన్మానిస్తున్న సులేమాన్, కళాశాల యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: మానవ జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైందని విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ ఉంటే మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని అకాడమిక్ కన్సల్‌టెంట్ డాక్టర్ ఎస్‌కే సులేమాన్ అన్నారు. శనివారం స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఫెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సులేమాన్ మాట్లాడుతూ యువతలో క్రియేటివ్ థింకింగ్, లాజికల్ అప్రోచ్, డెసిషన్ మేకింగ్, డీప్ సీకింగ్, అర్థమెటిక్ మరియు ఇంగ్లీష్ రీజనింగ్ స్కిల్స్ లాంటి వాటిలో నైపుణ్యం ఉంటే మంచి ఉద్యోగ అవకాశాలు తెచ్చి పెడతాయన్నారు. కార్యక్రమంలో ఏపి ఉన్నత విద్యామండలి, కాస్మోపాలిటన్ కల్చరల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెక్రటరీ వేగి వెంకట సోమరాజు, కళాశాల చైర్మన్ కేవీ నరసింహరావు, సెక్రటరీ కేవీ సీతారామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, తటవర్తి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాన తెచ్చిన తంటా



కాళ్లలో కాలువలా మారిన పల్లపు వీధి

శనివారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలతో పాటు రాష్ట్ర రహదారి జలమయ్యమయ్యాయి. ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు వర్షపు నీటితో నిండాయి. రాష్ట్ర రహదారి సైతం వర్షపు నీటితో కాలువలను చెరువులను తలపించింది. గ్రామంలో పల్లపు వీధి జలమయమైంది. దీంతో స్థానికులు, వాహనదారులు బయటికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా సినిమా హాల్ సెంటర్, కాళ్ల శివాలయం, తహసీల్దార్ కార్యాలయం వద్ద, కాళ్ళకూరు, జక్కరం, సీసలి గ్రామల పరిధిలో రాష్టర్ర రహదారిపై వర్షపు నీరు కాలువలను తలపించేలా మారాయి. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో నీరు వెళ్లే మార్గం లేక వర్షపు నీళ్ళు నిలబడి పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఇలా..

– కాళ్ల

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన



లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక కోర్టుహాల్‌లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. అదాలత్‌లో మొత్తం 184 కేసులు పరిష్కరించినట్టు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జిఎ.వాసంతి చెప్పారు. మొత్తం 3 బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులు రాజీ చేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు జి.గంగరాజు, ఎస్ రాజ్యలక్ష్మిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా జడ్జి వాసంతి మాట్లాడుతూ రాజీమార్గమే రాచమార్గమన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసి విశ్వేశ్వరరావు, కార్యదర్శి వి.ప్రకాశరావు పాల్గొన్నారు.

పాలకొల్లులో..



పాలకొల్లు సెంట్రల్: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి వరలక్ష్మి

పాలకొల్లు సెంట్రల్: పట్టణ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) నరసాపురం, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పాలకొల్లు, ఫుల్ ఇన్‌చార్జ్ రొక్కం వరలక్ష్మి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో 31 కేసులు పరిష్కారం అవ్వగా రూ. 28,04,080 లు కక్షిదారులకు పరిహారం అందిందన్నారు. ఇందులో ఐపీసీ కేసులు 13, ప్రోనోట్ కేసులు 3, ఇంజక్షన్ దావాలు 2, చెక్కు బౌన్స్ కేసులు 1, మనోవర్తి కేసులు 2, గృహహింస కేసులు 1, ఎక్సైజ్ కేసులు 7, బెంచ్ కోర్టు కేసులు 2 పరిష్కారమయ్యాయన్నారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు ఆర్‌వీ సూర్యనారాయణ, ప్రభాకర్, చంటి, యోహాను, పి.పూర్ణ రవిచంద్ర, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: కుష్టువ్యాధి అంటే సాధారణ అంటు వ్యాధువంటిదని అది ఒక క్రిమి కారకంగా కలిగే రోగమని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం ఉభయ గోదావరి జిల్లాల కో–ఆర్డినేటర్ ఎం.రంగనాథరావు, జిల్లా కో–ఆర్డినేటర్ ఆలమూరి బాబ్జీ అన్నారు. భీమవరంలో శనివారం బ్రైటర్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రీచ్ మీ ప్రాజెక్ట్ ద్వారా పట్టణంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు కుష్టువ్యాధి, పైలేరియా వ్యాధులపై నిర్వహించిన ఆరోగ్య అవగాహన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కుష్టు వ్యాధి రెండు రకాలుగా కలుగుతుందని మన దేశంలో 80 శాతం కుష్టు రోగం అంటుకాని రకానికి చెందినదేనన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు వీటిపై పూర్తి అవగాహనతో వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, డీఎస్ రత్నకుమార్, గొల్ల రాజ్‌కుమార్, పెట్టేం శుభాకర్, అంబటి ఆనందకుమార్, తుళ్ళూరు చంటి, సుధ, పాక రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి కుర్చీల అందజేత



వృద్ధాశ్రమానికి అందించిన కుర్చీల్లో వృద్ధులు

భీమవరం: స్థానిక స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గునుపూడిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమానికి పవర్ బ్యాటరీ, ఇన్వర్టర్ యూనిట్, తాడేరు రోడ్డులోని వృద్ధుల ఆశ్రమానికి 20 కుర్చీలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ డి రామ్‌కుమార్ విచ్చేసి మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ భీమవరం క్లబ్ తరఫున వృద్ధాశ్రమాల్లో జీవిస్తున్న వృద్ధుల అవసరాలు తెలుసుకుని అవసరమైన సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ అసోసియేషన్ భీమవరం క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గజపతిరాజు, ఆదిశేషులు, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామ శివారు పల్లిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు గణేష్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన కొల్లాటి జీవమణికంఠ అనే వ్యక్తి పాత గొడవల నేపథ్యంలో దాడి చేశాడు. దీంతో బాధితుడు బొడ్డు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని ఆకివీడు ఎస్సై తెలిపారు.

చెత్త డంపింగ్ అడ్డగింత

నరసాపురం: పట్టణంలోని 29వవార్డు దుంగపాటి దొడ్డి వద్ద పట్టణంలో చెత్తను డంప్ చేయాలని నిర్ణయించిన మున్సిపల్ అధికారులకు చుక్కెదురైంది. వార్డులో ఉన్న మున్సిపల్ స్థలంలో చెత్తను డంప్ చేసి, సదరు చెత్త ద్వారా సంపద సృష్టి కేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీని నిమిత్తం శనివారం ఫెన్సింగ్ వేయాలని నిర్ణయించి పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఇళ్ల మధ్య చెత్తను డంప్ చేస్తే సహించేదిలేదని మండిపడ్డారు. దీంతో అధికారులు ఈ ప్రయత్నాన్ని విరమించారు. ప్రస్తుతం మున్సిపాలిటీకి పట్టణంలో చెత్తను డంప్ చేయడానికి జాగా లేకుండా పోయింది. ఇప్పటి వరకూ చెత్తను డంప్ చేస్తున్న గోదావరి గట్టు ప్రాంతంలో చెత్తను వేయవద్దని జాతీయ కాలుష్య నియంత్రణ మండలి మున్సిపాలిటీని హెచ్చరించడంతో అక్కడ చెత్తను డంప్ చేయడాన్ని నిలుపుదల చేశారు.

16 నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ మంగళవారం నుంచి 20వ శనివారం వరకు సప్తనది జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం దేవస్థానంలో పవిత్రోత్సవాల కరపత్రాలు ఆలయ అర్చకులతో కలిసి ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక నిర్వహించి, 20న శనివారం 7 పుణ్యనదుల నుంచి తెచ్చిన పవిత్రజలాలతో స్వామి వారికి జలాభిషేకం నిర్వహిస్తామన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

వీరవాసరం: మండలంలోని రాయకుదురు హైస్కూల్‌లో జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం–విలువైన ప్రాణాన్ని కాపాడుకుందాం అనే అంశంపైన ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈగల్ సెల్ కానిస్టేబుల్స్ మురళి, నాగేశ్వరావు మత్తు పదార్థాలు సేవించడం వల్ల వచ్చే లక్షణాలు, అనర్థాలు, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల వచ్చే రోగాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవ్ చేయడం ద్వారా జరిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు.

వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలోని ఉన్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు చేశారు. అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

క్లుప్తంగా

సమాజాభివృద్ధికి ఆడపిల్లల చదువు అవసరం



విజయనిర్మలను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: ఆడపిల్లల చదువులు సమాజాభివృద్ధికి చాలా అవసరమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల అన్నారు. పట్టణంలోని శ్రీసూర్యా కళ్యాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌సీహెచ్‌ఈ అకడమిక్ అడ్వైయిజర్ డాక్టర్ షేక్ సులేమాన్, కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, డిగ్రీ ప్రిన్సిపాల్ పి.పుల్లారావు, అకడమిక్ ప్రిన్సిపాల్ టి.కృష్ణగుప్తా పాల్గొన్నారు.

విద్యా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: యాదవ విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకాలకు ఎంపిక చేయనున్నట్లు యాదవ ఎడ్యుకేషన్ సొసైటీ (వైఈఎస్) అధ్యక్షుడు కొండ్రు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2025లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఉత్తీర్ణత సాధించిన యాదవ విద్యార్థులకు తమ సంస్థ తరుపున విద్యా ప్రోత్సాహకాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రోత్సాహకానికి విద్యార్థులు ముందుగా ధరఖాస్తులు చేసుకోవాలని, ఈ నెల 21న నిర్వహించనున్న యాదవ ఎడ్యుకేషన్ సొసైటీలో ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు. పోత్సాహకాలు పొందిన విద్యార్థులకు వారి సెల్ నెంబర్‌కు వేదిక మెసేజ్‌లు పంపిస్తామని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

ఉత్సాహంగా చెస్ టోర్నమెంట్



భీమవరంలో ఇన్విటేషన్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం: స్థానిక అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇన్విటేషన్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ పోటీల్లో ఆరు విభాగాలలో గెలుపొందిన విజేతలకు రూ. 20 వేలు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గమిని రవిపవన్ కుమార్, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, తటవర్తి శ్రీనివాస్, సునీల్ అగర్వాల్, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదాన వితరణకు భీమవరానికి చెందిన ఎం.వెంకట గోపాల సత్యనారాయణ శర్మ కుటుంబ సభ్యులు రూ.లక్ష, వారి సంస్థ శ్రీఖర ఇంజినీరింగ్ సర్వీసెస్ భీమవరం పేరుపై ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష అందించారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు ఆశీర్వచనాలు నిర్వహించారు.ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రం, ఫొటో అందజేశారు.

గుమ్ములూరులో అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మండలంలోని గుమ్ములూరు గ్రామంలో శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. రామాలయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 32 వంటకాలతో భక్తులకు భోజనాన్ని అందించారు. గ్రామంలోని ప్రజలతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు కూడా అఖండ అన్నసమారాధనలో పాల్గొన్నారు.

బార్ల దరఖాస్తులకు గడువు పెంపు

తాడేపల్లిగూడెం: పట్టణంలో నాలుగు బార్లకు దరఖాస్తులు చేసుకునే సమయం పొడిగించినట్టు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి శనివారం తెలిపారు. ఓపెన్ కేటగిరీలో భర్తీ కాకుండా ఉన్న బార్లకు దరఖాస్తు చేసుకోవడానికి బ్యాంకు సెలవుల దృష్ట్యా 17వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు పొడిగించామన్నారు.